




# కరపత్రం

SINCE 2014

మంగళవారం జూన్ 23, 2026 | సంపుటి : 2 | సంచిక : 251 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

### దేవరకద్ర డిఆర్‌ఎస్ ప్రాజెక్ట్ సత్వరం చేపట్టాలి

- కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో సిఎం రేవంత్ భేటీ
- రక్షణ భూములు కేటాయించినందుకు కృతజ్ఞతలు



**న్యూఢిల్లీ,జూన్22 :** ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందని సిఎం రేంవత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమ్ఆర్‌వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హస్తిన పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామన్నారు.




## ఓట్, సీట్ చోరీలో బిజెపి నిమగ్నం

- సర్ ప్రక్రియ ఓట్ల తొలగింపుకే ప్రాధాన్యం
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు వంద ఖాయం
- బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణలో టీపీసీసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హనుమకొండ,జూన్22 :** సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. ఓట్ల చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్‌తో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు దోపిడీ చేసి ఇప్పుడు కేటీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతాద్ది 2 లో



## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

- నాంపల్లి కోర్టుకు హాజరుకాని అల్లు అర్జున్
- షూటింగ్‌ల కారణంగా రాలేకపోయారని వివరణ
- విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు

**హైదరాబాద్,జూన్22 :**

2లో..



## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం

- జిల్లాకో మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి అమలు
- ఏడాది కాలంలో 3.65 లక్షల పాస్‌బుక్‌ల జారీ
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,జూన్ 22 :** రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార /

## తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ మోకాలడ్డు

» పదేళ్లలోఏ భ్రష్టు పట్టించిన నేతలే చిల్లర రాజకీయాలు
» హరీష్ రావు, కెటిఆర్‌ల తీరుపై ఎంపి ఆగ్రహం
» సిఎం విజన్‌తో రాష్ట్రాభివృద్ధి చేస్తున్నారని చామల కితాబు



2 లో

**యాదాద్రి భువనగిరి,జూన్22 :** తెలంగాణ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ఓ విజన్‌తో ముందుకెళ్తుంటే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌తో విద్య, వైద్యం, రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు పోతున్నారని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బావ, బామ్మర్దులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం భువనగిరిలో ఎంపీ చామల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

» ఇబ్బంది పెట్టిన ప్రతీ ఒక్కరికీ సమాధానం ఇస్తా
» వర్దన్నపేట కార్యకర్తల భేటీలో కెటిఆర్ ఘాటు హెచ్చరిక




2లో..

**వరంగల్,జూన్22 :** వచ్చే ఐదేళ్లు ఎవ్వరినీ మరచిపోమని, సిఎం చిట్టి నాయుడును అస్సలు వదిలిపెట్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన నేతలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని మర్చిపోం.. మనమీద కేసులు పెట్టినోడిని మరిచిపోం.

## భూమి గురించి అడిగితే ఎస్‌బిఐపై పగబట్టారు

» రాయదుర్గం భూమల వేలంపై హరీష్ రావు ఫైర్



మిగతాది 2లో

**మహబూబ్‌నగర్,జూన్22 :** హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పటి ప్రభుత్వం ఎకరం భూమిచ్చిందని, అయితే...రేవంత్ రెడ్డి బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని అమ్మేసిండని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. అంతేగాకుండా ఇప్పుడు ఎస్‌బిఐ మీద పగపట్టిండని మండిపడ్డారు. అచ్చంపేట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎస్‌బీఐకి ఇచ్చిన భూమిని వేలానికి ఇచ్చిండు.. భూమిని అమ్మేసిండు. అమ్మేస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టుకు వెళ్లింది. మాకు ఎకరం భూమి ఇచ్చిర్రు. ఇది కూడా ఉచితంగా ఏం ఇయ్యలేదు. మేము దాదాపు రూ.20 కోట్లు పెట్టి ఈ భూమి కొనుక్కున్నమని.. ఈ భూమి మా పొజిషన్‌లో ఉన్నది. పైసల్ పెట్టి కొన్న మా భూమి రేవంత్ రెడ్డి ఎట్లా అమ్ముకున్నడు.. అని హైకోర్టుకు పోయారన్నారు.కోర్టు వాళ్లు పైసలు పెట్టి కొన్నది నిజమే కదా ఈ అమ్మకం తప్పు అని స్టే ఇచ్చింది. ఖతం రేవంత్ రెడ్డి ఎస్‌బీఐ మీద పగపట్టిండు.

## వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యం

- ఆర్ అండ్ బి అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేయాలి
- వరదల సమయంలో తక్షణ స్పందన కోసం సిద్ధం
- అత్యవసర పరిస్థితుల కోసం యంత్రాలు, సామగ్రిని సిద్ధం చేయాలి
- రెడ్ అలర్ట్ సమయంలో 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో ఉండాలి
- నష్టం జరిగిన 24 గంటల్లోపు పూర్తి నివేదికలు సమర్పించాలి
- రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్,జూన్22 :**



మిగతాది 2లో

## భువనగిరి కోటకు పూర్వ వైభవం

- టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తాం
- రోప్‌వే నిర్మించే అంశాన్ని పరిశీలించిన మంత్రి జూపల్లి



2లో..

**యాదాద్రి భువనగిరి,జూన్22 :** చరిత్ర కలిగిన పురాతన భువనగిరి ఖిల్లాకు పూర్వవైభవం తీసుకొస్తామని టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. దీనికి పర్యాటక శోభ కల్పిస్తామని అన్నారు. సోమవారం ఉదయం భువనగిరి ఖిల్లా పైకి రోప్ వే నిర్మించే స్థలాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫోర్ట్ రిస్టోరేషన్ చేసి చరిత్ర తెలిపేలా మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. గంటకు మూడు వందల మంది ప్రయాణికులు ఖిల్లా పైకి వెళ్లేలా రోప్ వే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



## నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

- మోడీ 12 పాలనపై పుస్తకాలు అందచేత

**హైదరాబాద్,జూన్22 :** తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని బీజేపీ కీలక నేత కలవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

2లో..

# వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో వర్షాకాలం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను నిరంతరం కొనసాగించడంతో పాటు, వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాలకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు సమీక్ష నిర్వహించి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు..రాష్ట్ర రోడ్లు / భవనాల శాఖ ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను విడుదల చేసినట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇదివరకే తాను సమీక్షించిన అంశాల మేరకు ఆర్/బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల ఆర్ అండ్ బి అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి సూచించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసే వరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. త్యవసర పరిస్థితులను.. ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, డీ-వాటరింగ్ పంపులు, ఇసుక సంచులు, కంకర, తారు, ఆర్‌సీసీ సామగ్రి, హెచ్‌డీపీఈ పైపులు తదితర అవసరమైన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, కట్టల బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ప్రమాదకర ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ), తెలంగాణ డిజాస్టర్ ప్రివెన్షన్ అండ్ సేఫ్టీ పోర్టల్, తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని,పోలీస్,రెవెన్యూ, ఇరిగేషన్,విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను

అందుబాటులోకి తీసుకురావాలని, వరద నీరు తగ్గిన వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. నష్టం జరిగిన 24 గంటల్లోపు ఫోటోలు, జీపీఎస్ వివరాలతో నష్టం అంచనా నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అత్యవసర పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఇంజినీర్లకు అప్పగించిన అధికారాల మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. వరదల కారణంగా చేపట్టే పునరుద్ధరణ పనుల వ్యయాన్ని ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఎంఎఫ్ నిబంధనల ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు.

వర్షపాతం తీవ్రతను బట్టి రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్,ఎల్లో,ఆరెంజ్, రెడ్ కలర్-కోడ్ ఆధారిత హెచ్చరిక వ్యవస్థను అమలు చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వర్షపాతం నమోదయ్యే ఆరెంజ్ అలర్ట్ సమయంలో ఇఇలు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండగా, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. హైదరాబాద్ ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సెంటర్ కు ఈ వర్షాకాలంలో రోజువారీ పరిస్థితుల నివేదికలు తప్పనిసరిగా సమర్పించాలని, నష్టం జరగకపోయినా 'నిల్ రిపోర్ట్' ఇవ్వాలని ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యేక అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు.

అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసుపై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురు కోర్టు ముందు హాజరుకాగా, సినీ నటుడు అల్లు అర్జున్ వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సంధ్య థియేటర్ కేసులో నాంపల్లి కోర్టుకు సినీనటుడు అల్లు అర్జున్ హాజరు కాలేదు. షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఇవాళ కోర్టుకు హాజరుకావాలని 19 మంది నిందితులకు ఇటీవల నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, అల్లు అర్జున్ మినహా మిగతా నిందితులంతా న్యాయమూర్తి ఎదుట హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. అనంతరం కేసు విచారణను న్యాయమూర్తి కేసు విచారణను జులై 6కి వాయిదా వేశారు. అనంతరం ఈ కేసు విచారణను జులై 6వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఎ11 నిందితుడిగా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా అర్జున్ కోర్టు ముందు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. అయితే అల్లు అర్జున్ గైర్హాజరుకు గల కారణాలను న్యాయస్థానానికి ఆయన తరఫు న్యాయవాది వివరించారు. సంధ్యా థియేటర్

యాజమాన్యాన్ని తొలి పదిమంది జాబితాలో చేర్చగా, మొత్తం 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 19 మంది నిందితులకు నాంపల్లి కోర్టు ఇప్పటికే సమన్లు జారీ చేసింది. ఈ ఘటన 2024 డిసెంబర్ 4వ తేదీన పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో అభిమానులు థియేటర్‌కు చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు 23 మందిని నిందితులుగా పేర్కొంటూ నాంపల్లి కోర్టుకు ఛార్జ్‌షీట్ సమర్పించారు. నిందితుల వ్యక్తిగత హాజరు ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ కేసులో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు నాంపల్లి కోర్టు సిద్ధమవుతోంది. ఈ కేసు సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారగా, కోర్టు తదుపరి విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ మోకాలడ్డు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగి సినిమా మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయంలో సినిమా మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజల జీవితాలు కేటీఆర్‌కు సినిమాలాగా కనపడుతున్నాయా.. అని కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన సూపర్ హిట్ అనుకుంటున్నారా...అని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మిగులు రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన షోలే సినిమా కాదని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలన గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి క్రాప్ డైవర్షన్‌పై అవగాహన కల్పిస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పండించిన ధాన్యం అత్యధిక దిగుబడి వస్తే కేంద్రప్రభుత్వం ఎందుకు కొనట్లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని తెలిపారు. మెట్రోఫేజ్- 2 కోసం సంప్రదింపులు చేసి ఎల్ అండ్‌టీకి ఎగ్జిట్ ఇచ్చారని.. మెట్రోఫేజ్ -2ను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. మెట్రోఫేజ్-2పై బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మెట్రోఫేజ్ -2పై కిషన్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించాలని.. కలిసి అభివృద్ధిలో ముందుకెళ్దామని సీఎం అంటున్నారని అన్నారు. కేటీఆర్ బాధ్యతతో ప్రజల కోణంలో మాట్లాడాలని హితవు పలికారు. హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. హైడ్రా హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకంగా మారిందని తెలిపారు. నాళాలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టాలని హైడ్రా భావిస్తోందా...? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం ముంపునకు గురికాకుండా హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. బీజేపీ ఓటు, సీటు చోరీల గురించి కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదన్ని ÷ర్ అయ్యారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై చిత్తశుద్ధి లేని మాటలు మాట్లాడుతున్నారని కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భువనగిరి కోటకు పూర్వ వైభవం

మొదటిపేజీ తరువాయి

యాదగిరిగుట్ట , భువనగిరి ఖిల్లా, కొలనుపాక సోమేశ్వర ఆలయం, స్వర్ణగిరి కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన టూరిజం శాఖను దేశంలో నంబర్ వన్‌గా గుర్తింపు తీసుకొస్తామని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో చారిత్రక కట్టడాలు ఉన్నాయన్నారు. వాటిని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసి వందలాది మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. నెలకు రెండు రోజులైనా టూరిజంకు సమయం కేటాయించాలని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పర్యాటక స్థలాలకు వెళ్తే ప్రజల ఆలోచనా విధానం మారుతుందని... అనేక మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## ఓట్, సీట్ చోరీలో బిజెపి నిమగ్నం

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని మహేశ్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళు _న్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్ఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

## చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

మొదటిపేజీ తరువాయి

మనతో నిలబడినోళ్లను కూడా మరిచిపోమన్నారు. తప్పకుండా చెప్తున్నా.. నేను కేసీఆర్ సారంతా మంచోన్నైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది.. పక్కా విడిచిపెట్ట. రిటైరైనా పారిపోయినా సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. ఎవడెవడైతే మా కార్యకర్తలను సతాయించిండో ఒక్కొక్కడిని వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది.. వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. ఇది నేనేం ఊరికే చెప్పడం లేదు.. గుర్తు పెట్టుకోండి. కానీ రమేశన్న (ఆరూరి రమేశ్) వీడు మంచోడేనే అన్నా అని మళ్లా వారిని తీసుకొని రావొద్దని కేటీఆర్ సూచించారు.

## నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

మొదటిపేజీ తరువాయి

బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణలను వివిధ రంగాల ప్రముఖులకు వివరించే ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగానే రామచందర్ రావు చిరంజీవిని కలిసి మోదీ ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలు, ప్రచార పత్రాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక రంగాల్లో జరిగిన మార్పులపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.

అధికారికంగా ఇది మర్యాదపూర్వక భేటీగా చెబుతున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం పలు విశ్లేషణలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చిరంజీవి, అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాల్లో బిజీ అయిన ఆయన మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి వస్తారా? అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యంగా బీజేపీతో ఆయన సాన్నిహిత్యం పెరుగుతుందా అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. చిరంజీవి తమ్ముడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్‌కు బీజేపీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో చిరంజీవి-బీజేపీ భేటీకి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈ సమావేశం కేవలం మర్యాదపూర్వకంగానే జరిగిందా? లేక భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు సంకేతమా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## భూమి గురించి అడిగితే ఎస్‌బిఐపై పగబట్టారు

మొదటిపేజీ తరువాయి

ఎస్‌బీఐని నిషేధిస్తాం. ఎస్‌బీఐలో ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లు బయటకు తీసేస్తాం. ఎస్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వానికి ఉండే ఖాతాలన్నీ తీసేస్తా.. అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా బ్లాక్ మెయిల్ చేస్తుండు.. రేవంత్ రెడ్డి తీరు ఎవరన్నా ప్రశ్నిస్తే పగబడ్తమన్నట్టు ఉంది. ఇవాళ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియానే నిషేధిస్తా అంటున్నడు.. రేపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వరల్డ్ బ్యాంక్ కూడా నీ మాట వినలేదనుకో దాన్ని కూడా నిషేధిస్తా అంటాడు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక ఒక బ్యాంక్ అయితే కావాలి కదా.. ఎవరు నీకు వ్యతిరేకంగా మాట్లాడితే ఆ బ్యాంక్‌నే నిషేధిస్తా అంటే మరి ఏం చేస్తడు.. నాకో డౌటు..కొత్తగా కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెడ్తడో ఏమో.. పెట్టినా పెడ్తడు మస్త్ జమ అయినయ్ పైసలు. రేపు ఎనుముల కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెట్టినా పెడ్తరన్నారు హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం

మొదటిపేజీ తరువాయి

పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సోమవార రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు.

తంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రిగారు సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ

సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి గారు ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. త ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

## నెత్తురోడిన ఎపి రోడ్లు వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

### ప్రకాశంలో ముగ్గురు, తిరుపతిలో ఇద్దరు మృత్యువాత

ఎపిలో రోడ్లు నెత్తురోడాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. ప్రకాశం జిల్లాలో ముగ్గురు, తిరుపతి జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం కామేపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన 10 మంది నాదెండ్ల మండలం సంకురాత్రిపాడులో జరిగే దశదిన కర్మకు హాజరయ్యేందుకు ఆటోలో బయల్దేరారు. కామేపల్లి రైల్వే అండర్‌పాస్ సమీపానికి వచ్చేసరికి.. గ్రానైట్‌తో వస్తున్న లారీ మలుపు తిరుగుతూ.. ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుకొండలు (60), రమణమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన మరో ఏడుగురిని సమీపంలోని వివిధ ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుబ్బాయమ్మ (70) ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఉడుంవారిపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి ఓ ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి కడప వెళ్తోంది. మరోవైపు ఓ లారీ ఎర్రగుంట్ల నుంచి చెన్నైకి వెళ్తోంది. ఉడుంవారిపల్లి వద్దకు రాగానే లారీ.. బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడాది వయసు గల చిన్నారి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పలువురికి కాళ్లు, చేతులు తెగిపడి రోడ్డు మొత్తం రక్తసిక్తమైంది. కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్సులో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విరిగిన చేతిని సైతం అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపడం ప్రమాద తీవ్రతకు అద్దం పట్టింది. రాజంపేట నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అందులో కె. జస్విక (16) అనే బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. కోడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## చిత్తూరు జిల్లాలో దారుణ ఘటన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణం

చిత్తూరు జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన దిగుమసపల్లె పంచాయతీ బంగారెడ్డిల్లిలో జరిగింది. దామోదరం(30) అనే వ్యక్తి.. తన భార్య నిర్మల(25), కుమారుడు రాజేష్, కుమార్తె శ్రీవిద్యకు విషమిచ్చి, అనంతరం తానూ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కొన్ని రోజులుగా సీఎంసీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. భార్య ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడం, ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉండటంతో దామోదరం ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న బీఎన్ఆర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దామోదర్.. సూసైడ్ నోట్‌లో బ్యాంకు ఏటీఎం కార్డు, ఫోన్‌పే పిన్ నెంబర్ రాసిపెట్టాడు. అంత్యక్రియలకు తన ఖాతా నుంచే డబ్బులు వాడుకోవాలని లేఖలో పేర్కొన్నాడు.

## భూపాలపల్లి జిల్లాలో దుర్ఘటన

- వాహనాలు తనిఖీ చేస్తుండగా దూసుకొచ్చిన లారీ
- డిటివో వెంకన్న అరక్కడిక్కడే మృతి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గణపురం మండలం

చెల్పూరు శివారులో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. రవాణా శాఖ కార్యాలయం ఎదుట జిల్లా రవాణా అధికారి డీటీఓ వెంకన్న వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, బొగ్గు లోడుతో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి ఆయనపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వెంకన్నకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకన్న మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## నాంపల్లి కోర్టులో విచారణ

**వర్చువల్‌గా హాజరైన హీరో అల్లు అర్జున్**

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నాంపల్లి కోర్టు విచారణకు హీరో అల్లు అర్జున్ వర్చువల్‌గా హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకు నాంపల్లి కోర్టు అనుమతివ్వడంతో ముంబై నుంచి వర్చువల్‌గా అల్లు అర్జున్ అటెండ్ అయ్యారు. ఈ కేసులో మిగిలిన నిందితులు వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరయ్యారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఏ 11 గా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. ఈరోజు(సోమవారం) ఉదయం సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ వ్యక్తిగతంగా కోర్టు ముందు విచారణకు హాజరుకావాల్సి ఉంది. సినిమా షూటింగ్‌ల కారణంగా అర్జున్ ముంబైలో ఉన్నారని, అక్కడి నుంచి వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన తరఫున న్యాయవాది మెమో దాఖలు చేయగా.. అందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో ఈరోజు మధ్యాహ్నం నాంపల్లి కోర్టు ముందు అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా హాజరయ్యారు.ఎ

# నాణ్యమైన వరి విత్తనాలు ఒకేచోట అందుబాటులోకి

## యూరియా బస్తాల ముందస్తు నమోదు సౌకర్యం ప్రారంభం

**వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 22:**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు సులభంగా అందుబాటులో ఉంచేందుకు జూన్ 23 నుంచి జూన్ 30 వరకు మండలంలోని రైతు వేదికల్లో రైతు విత్తన మేళా నిర్వహించనున్నట్లు జమ్మికుంట మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరి విత్తనాల్లో అందుబాటులో ఉన్న రకాలను రైతు వేదికల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకే చోట పరిశీలించి కొనుగోలు చేసుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలలో నాణ్యమైన విత్తనాల పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు. సరైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు రైతులు ఆర్థికంగా లాభపడే అవకాశం ఉంటుందని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సాగుకు అనువైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.విత్తన మేళాలో పాల్గొనే రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవసరమైన సూచనలు, సలహాలు అందించనున్నట్లు తెలిపారు. పంటల ఎంపిక, సాగు విధానాలు, విత్తనాల వినియోగం తదితర అంశాలపై కూడా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.ఇదిలా ఉండగా రైతులకు అవసరమైన యూరియా ఎరువులను సకాలంలో అందించేందుకు యూరియా బస్తాల ముందస్తు నమోదు ప్రక్రియను కూడా ప్రారంభించినట్లు ఖాదర్ హుస్సేన్ తెలిపారు. నేటి నుంచి రైతులు ప్రత్యేక నమోదు విధానం ద్వారా తమకు అవసరమైన యూరియా బస్తాలను ముందుగానే నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు.గత యాసంగి సీజన్‌లో యూరియా నమోదు చేసిన మొబైల్ నంబరుతో రైతులు ప్రవేశించి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ముందుగా తమ పట్టాదారు పాస్ పుస్తకంలో నమోదైన సాగు విస్తీర్ణంలో ప్రస్తుతం సాగు చేస్తున్న ఒక పంటను నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు.ఒకవేళ రైతు రెండు లేదా అంతకంటే ఎక్కువ పంటలను సాగు చేస్తున్నట్లయితే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్న పంట వివరాలను నమోదు చేయాలని సూచించారు. దీని ద్వారా రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేపట్టడం సులభమవుతుందని తెలిపారు.కౌలు రైతులకు కూడా ఈ సౌకర్యం కల్పించినట్లు ఆయన వెల్లడించారు. కౌలు సాగు చేస్తున్న రైతులు లేదా పట్టాదారు మరణించిన సందర్భాల్లో ప్రత్యేక నమోదు సదుపాయం ద్వారా పట్టాదారు ధృవీకరణతో నమోదు చేసుకుని ఒక పంట





కాలానికి అవసరమైన యూరియా బస్తాలను పొందవచ్చని పేర్కొన్నారు.యూరియా నమోదు చేసుకోవడానికి రైతు వద్ద తప్పనిసరిగా ఆధునిక మొబైల్ ఫోన్ ఉండాల్సిన అవసరం లేదని తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు లేదా ఇతరుల మొబైల్ ఫోన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని వివరించారు. అదేవిధంగా మండలంలోని ఎరువుల దుకాణాల వద్ద రైతులకు అవసరమైన సహాయం అందుబాటులో ఉంటుందని చెప్పారు.నమోదు ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఎదురైతే సమీప ఎరువుల దుకాణదారులను లేదా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.రైతులందరూ విత్తన మేళాలో పాల్గొని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవడంతో పాటు యూరియా బస్తాల ముందస్తు నమోదును పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ సీజన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# నేడు మాసాయిపేట మండలం రైతు వేదిక లోవిత్తన మేళా కార్యక్రమం

**మాసాయిపేట వ్యవసాయ శాఖ అధికారిని కవిత**
**అందరూ ప్రజాప్రతినిధులు రైతు సోదరులు ప్రాథమిక వ్యవసాయ శాఖ సహకార సంఘ సభ్యులు విత్తన విక్రతలు పాల్గొనాలి**
**నాణ్యమైన విత్తనం అధిక దిగుబడికి మొదటి అడుగు మాసాయిపేట మండల వ్యవసాయ శాఖఅధికారిని కవిత**



**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట జూన్ 22**
మెదక్ జిల్లా మాసాయిపేట మండలంలోని రైతు వేదికలో నేడు విత్తనమేల కార్యక్రమం విజయవంతం చేయాలని మాసాయిపేట మండల వ్యవసాయ శాఖ అధికారిని కవిత తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సోదరులకు ప్రజా ప్రతినిధులకు,ఖరీఫ్-2026 సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, నాణ్యమైన విత్తనాల ఎంపిక, పంటల ప్రణాళిక ప్రభుత్వ సూచనలపై అవగాహన కల్పించేందుకు విత్తన మేళా కార్యక్రమంనిర్వహించబడుతోందని నేటిమంగళవారం ఉదయం 10:00 గంటల నుండిమాసాయిపేట రైతు వేదికలో జరగనున్న కార్యక్రమంలో ముఖ్యాంశాల వివరాలు ఆమె తెలిపారు ఖరీఫ్-2026 కొరకు అందుబాటులో ఉన్న వివిధ పంటల విత్తనాల వివరాలు ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల వరి విత్తనాలపై అవగాహన మరియు విక్రయంవిత్తనాల నాణ్యత, ఎంపిక సాగు పద్ధతులపై సూచనలుపంటల నమోదు ప్రభుత్వ పథకాల వివరాలు తెలిపారుఅందరు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతూ అందరూఆహ్వానితులే ప్రజా ప్రతినిధులు, రైతు సోదరులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులు, విత్తన విక్రేతలు.నాణ్యమైన విత్తనం -- అధిక దిగుబడికి మొదటి అడుగు ఆమె తెలియజేశారు.

# లయన్స్ క్లబ్ గోదావరిఖని శతాబ్ది కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), జూన్ 22:**
సమాజ సేవను ధ్యేయంగా చేసుకుని ముందుకు సాగుతున్న లయన్స్ క్లబ్ గోదావరిఖని శతాబ్ది నూతన కార్యవర్గం సోమవారం ఎన్టీపీసీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ప్రమాణ స్వీకారం చేసింది. క్లబ్ అధ్యక్షుడిగా మాచిడి మహేందర్ గౌడ్, కార్యదర్శిగా పైడ సాయికుమార్ గౌడ్, కోశాధికారిగా కొండ శ్రీకాంత్ గౌడ్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు తమ బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తామని తెలిపారు. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, పేద మరియు నిరుపేదలకు సహాయ సహకారాల అందజేత వంటి రంగాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, ప్రముఖులు, ఆహ్వానితులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. సమాజాభివృద్ధికి లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన బాధ్యతలు చేపట్టిన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# కమిషనరేట్ పరిధిలో జాతీయ మెగాలోక్ అదాలత్

**- మొత్తం 6,545 కేసుల పరిష్కారం**
**- 83 సైబర్ నేర కేసుల్లో బాధితులకు రూ.73,67,714 తిరిగి అందజేత**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 22:**
ఈ నెల 20న నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదై దర్యాప్తులో ఉన్న, అలాగే కోర్టు విచారణలో ఉన్న కాంపౌండబుల్ కేసుల్లో ఐపీసీ కేసులు 637, ప్రత్యేక చట్టాలకు సంబంధించిన (ఎస్ఎల్ఎల్) కేసులు 46 పరిష్కరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 76 సైబర్ నేర కేసుల్లో బాధితులకు రూ.27,35,072 తిరిగి అందజేశారు. సీసీపీఎస్ పోలీస్ స్టేషన్, రామగుండంలో నమోదైన 07 కేసుల్లో బాధితులకు రూ.46,32,647 తిరిగి అందజేయబడిందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా పెట్టి కేసులు, ట్రాఫిక్, ఎక్సైజ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర స్వల్ప చట్టపరమైన కేసులు వేగంగా పరిష్కరించబడినట్లు తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారంతో ప్రజలకు




సమయం, ధనం ఆదా అయ్యాయని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేసుల పరిష్కారానికి సహకరించారని తెలిపారు. పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఈ విజయవంతమైన ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. గత 15 రోజులుగా రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు, కోర్టు సిబ్బంది కేసుల్లో ఉన్న పక్షాలను స్వయంగా కలిసి, రాజీ మార్గమే ఉత్తమ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని అవగాహన కల్పించడంతో నిర్దేశించిన లక్ష్యానికి మించి కేసులు పరిష్కరించగలిగామని తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించిన అధికారులు, కృషి చేసిన సిబ్బందికి త్వరలో రివార్డులు అందజేస్తామని తెలిపారు. అలాగే, కమిషనరేట్‌లో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేసిన రెండు జోన్ల ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవా సంస్థలకు పోలీస్ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిరోజూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు కోర్టు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# షోరూమ్‌లో చోరీ యత్నం.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు






**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 22**
జమ్మికుంట పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డుపై ఉన్న శ్రీ సాయి వెహికల్ షోరూమ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారుడు అబ్బీడి తిరుపతి రెడ్డి (47), తండ్రి శివారెడ్డి, ఇల్లంతకుంట మండలం మదనపల్లి గ్రామానికి చెందినవాడు. జమ్మికుంటలో హుజూరాబాద్ రోడ్డుపై ఉన్న శ్రీ సాయి వెహికల్ షోరూమ్‌ను నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు.ఈ నెల 21వ తేదీ రాత్రి సుమారు 9 గంటల సమయంలో షోరూమ్‌ను మూసివేసి ఇంటికి వెళ్లిన ఆయన, ఈ రోజు ఉదయం సుమారు 8:30 గంటలకు తిరిగి షోరూమ్‌కు వచ్చి తలుపులు తెరిచాడు. లోపలికి వెళ్లి చూడగా కౌంటర్ వద్ద ఉన్న టేబుల్‌పై పత్రాలు, ఇతర వస్తువులు చిందరవందరగా ఉండటం గమనించి అనుమానం వ్యక్తం చేశాడు.దీంతో షోరూమ్ మొత్తాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా ఎటువంటి వాహనాలు, నగదు లేదా ఇతర వస్తువులు చోరీకి గురికాలేదని గుర్తించాడు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో షోరూమ్‌లోకి ప్రవేశించి దొంగతనం చేయడానికి ప్రయత్నించి ఉండవచ్చని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఫిర్యాదు అందుకున్న జమ్మికుంట పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. షోరూమ్‌లోకి ప్రవేశించిన వ్యక్తులు ఎవరు, ఏ ఉద్దేశంతో వచ్చారు అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని, పూర్తి వివరాలు విచారణలో వెల్లడవుతాయని జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

# నిరుపేద చేనేత కుటుంబానికి రూ.40,500 ఆర్థిక సహాయం

**చేనేత కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వానికి, ప్రజలకు పిలుపు**
**టీపీఆర్‌యూఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి నర్సింగరావు**

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్ జూన్ 22**
హైదరాబాద్ జిల్లా పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీపీఆర్‌యూఎస్) ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన నిరుపేద చేనేత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. రెండు కిడ్నీలు దెబ్బతిని ఇటీవల మృతి చెందిన చేనేత యువకుడు వర్కాల ఉపేందర్ కుటుంబాన్ని ఆదుకునేందుకు సంఘం సభ్యుల విరాళాలతో రూ.40,500ను ఆయన చిన్న కుమార్తె శ్రీజ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఏర్పాటు చేసి అందజేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వడ్డేపల్లి నర్సింగరావు మాట్లాడుతూ, చిన్న వయసులోనే ఉపేందర్ మరణించడం అత్యంత బాధాకరమన్నారు. చేనేత కార్మికులు వృత్తితో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఒకప్పుడు వందలాది మందికి ఉపాధి కల్పించిన కొయ్యలగూడెం చేనేత సహకార సంఘం నేడు సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలోని వైట్ హౌస్‌కు సైతం ఫర్నిషింగ్ వస్త్రాలు ఎగుమతి చేసిన ఘనత కలిగిన చేనేత రంగం నేడు ఆదరణ లేక ఇబ్బందులు పడుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వం చేనేత కార్మికులకు మరింత చేయూతనందించి నేత వృత్తిని కాపాడాలని, ప్రజలు



కూడా వారానికి కనీసం ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించి ఈ రంగానికి మద్దతు తెలపాలని ఆయన కోరారు.హైదరాబాద్ జిల్లా పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం 2018లో రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు నాయకత్వంలో స్థాపించబడింది. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోంది. 2024లో సంఘం ఆరవ వార్షికోత్సవం సందర్భంగా పలువురు పద్మశాలి ప్రముఖులను సన్మానించగా, 2025లో అనాథ విద్యార్థి గృహానికి ఆర్థిక సహాయం అందించింది. ఈ ఏడాది ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌లోని వృద్ధాశ్రమానికి అన్నదానం కోసం విరాళం అందజేసింది.కార్యక్రమంలో దోర్నాల విజయకుమార్, కోమాకుల సమ్మయ్య, గెంట్యాల రామచంద్రం, బోడ అశోక్ కుమార్ తదితరులు మాట్లాడుతూ, ఉపేందర్ పిల్లలను మంచి విద్యతో తీర్చిదిద్దాలని, అవసరమైతే



గురుకులాలు లేదా అనాథ విద్యార్థి గృహాల్లో చదివించాలని సూచించారు.ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన కోశాధికారి గోనె యాదగిరి, సలహాదారులు గంజి కుమారస్వామి, రాపోలు నర్సయ్య, ఉపాధ్యక్షులు వడ్లకొండ రమేష్, కోమాకుల సమ్మయ్య, గెంట్యాల రామచంద్రం, కార్యనిర్వాహక కార్యదర్శి కైరంకొండ యాదగిరి, సంయుక్త కార్యదర్శి బోడ అశోక్ కుమార్, సహాయ కార్యదర్శి పుట్ట కనకదుర్గతో పాటు సంఘం సభ్యులందరికీ వడ్డేపల్లి నర్సింగరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొయ్యలగూడెం గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పొట్టబత్తిని బాలరత్నం, గ్రామ సర్పంచ్ కైరంకొండ స్వప్న గణేష్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లా పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చేసిన సేవా కార్యక్రమాన్ని వారు అభినందించారు. ఉపేందర్ భార్య గంగ మరియు కుటుంబ సభ్యులు సంఘం సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# టీ-పీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ ఇన్‌చార్జ్‌కు ఘన స్వాగతం పలికిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, జూన్ 22:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన కల్పించే కార్యక్రమంలో పాల్గొనేందుకు వరంగల్ జిల్లాకు విచ్చేసిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీ–పీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య పుష్పగుచ్ఛాలు అందజేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఎస్ఐఆర్ అంశంపై బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన కల్పించేందుకు పార్టీ శ్రేణులను చైతన్యపరిచే దిశగా పార్టీ నాయకత్వం చేపట్టిన ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకమని ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు.

# క్రీడాకారులకు అంతర్జాతీయ 'ఒలంపిక్ డే' శుభాకాంక్షలు తెలిపిన ఒలంపిక్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ఈసీ మెంబర్, ఫెన్సింగ్ జిల్లా కార్యదర్శి దుబ్బ రాము

- క్రీడా స్ఫూర్తితో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపు




**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 23**
జూన్ 23న జరుపుకునే అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు, క్రీడాభిమానులకు ఒలింపిక్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ఈసీ సభ్యులు, ఫెన్సింగ్ క్రీడా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దుబ్బ రాము శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దుబ్బ రాము మాట్లాడుతూ.. ఒలింపిక్ ఉద్యమం ప్రపంచ దేశాల మధ్య స్నేహం, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని పేర్కొన్నారు. యువత క్రీడలను కెరీర్‌గా ఎంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఒలింపిక్ స్ఫూర్తితో క్రీడాకారులు పట్టుదల, అంకితభావం, కఠోర శ్రమతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. క్రీడా రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చిన ఆయన, వరంగల్ జిల్లా నుంచి మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేస్తూ.. క్రీడా స్ఫూర్తిని మరింతగా పెంపొందించుకోవాలని మనసారా దుబ్బ రాము ఆకాంక్షించారు.

# హనుమకొండలో టీపీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ ఇన్‌చార్జ్‌కు ఘన స్వాగతం



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 23**
ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష (ఎస్ఐఆర్) ప్రక్రియపై బూత్ స్థాయి ప్రతినిధులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో పాల్గొనేందుకు హనుమకొండ జిల్లాకు విచ్చేసిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్లకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘన స్వాగతం పలికారు.హనుమకొండలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో వారిని మర్యాద పూర్వకంగా కలిసిన కడియం శ్రీహరి పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం, పార్టీ శ్రేణులను మరింత చైతన్యవంతం చేయడం వంటి అంశాలపై చర్చించారు.

# చెల్పూర్ ఆర్టీఓ కార్యాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జిల్లా రవాణా అధికారి మృతి



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 23:**
సోమవారం రోజు సుమారు 09:30 గంటల సమయంలో భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌లోని ఆర్టీఓ కార్యాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.
మార్ల్ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన బొగ్గు లోడ్‌తో వెళు_న్న లారీ (టీ22టి2687)ను మహ్మద్ తస్లీమ్ నడుపుతూ జెన్‌కో వైపు వెళ్తుండగా, జిల్లా రవాణా అధికారి వెంకన్న తమ వాహనం (టీ03ఖీ+3339) నుండి దిగి, ఆర్టీఓ కార్యాలయ ప్రాంగణంలోకి సీజ్ చేసిన హార్వెస్టర్ వాహనాన్ని ప్రవేశపెట్టేందుకు రోడ్డుపై వాహనాల రాకపోకలను నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు.ఈ క్రమంలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా,అతివేగంగా వాహనాన్ని నడుపుతూ డీటీఓ ను ఢీకొనడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే అక్కడికక్కడే మృతి చెందినట్లు నిర్ధారించబడింది.
మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించడం జరిగింది . ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నాము. లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడా లేదా అనే అంశంతో పాటు ప్రమాదానికి దారితీసిన ఇతర కారణాలపై కూడా అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది.
జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలపడం జరిగింది.

# పేదలకు పట్టాలిచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

- ఇప్పటికే కట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లను అర్హులైన పేద ప్రజలకు పంచాలి
- సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా




పేదలకు పట్టా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ.. సోమవారం సిపిఐ ఖిలా వరంగల్ మండల సమితి అద్వర్యంలో తాహశీల్దార్ కార్యలయం ముందు ధర్నా నిర్వహించి తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా పాల్గొని మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా వ్యప్తంగా ఇండ్ల స్థలాల కోసం పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు అవుతున్న ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు, ఇండ్లు వేసుకుని నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలుగా పేదలకు పంచడానికి కట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లను త్వరగా పేద ప్రజలకు పెంచాలని లేదంటే సిపిఐ ఆధ్వర్యంలో ఆ ఇండ్లను అర్హులైన పేద ప్రజలకు పంచుతామని హెచ్చరించారు. ఇటీవల పేదల ఇండ్లను కూల్చడం ఏమైనా చర్య అని పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని ఈనెల 27న వరంగల్ జిల్లా హనుమకొండ జిల్లా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం ఉంటుందని పేదల నుండి ఇండ్ల స్థలాల కోసం అప్లికేషన్స్ స్వీకరించి జూన్ 6న ఇందిరా పార్క్ వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం దిగివచి పేద ప్రజలకు ఇండ్ల స్థలాల పట్టాలు పంచాలని లేకపోతే భవిష్యత్తులో అనేక పోరాటాల కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, సంగీ ఏలేందర్ జిల్లా సమితి సభ్యులు ఓర్సు రాజు తాళ్ళపల్లి జాన్ పాల్, సుంకరి భవాని, బెజ్జంకి యాకాంబ్ర చారి, ల్యాదల్ల శరత్, దామేర కృష్ణ చిట్యాల సువర్ణ, నల్లతీగల కుమార్, రాచర్ల రాజేందర్, యాకుబ్, డి.సాంబమూర్తి, చిరంజీవి,దుమాల పద్మ, సారంగం, శంశుద్ధిన్ తస్లీం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలం..

- ఓటు హక్కులను కాపాడుకోవాలి
- ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ పేరుతో హక్కులను హరించే కుట్రలను తిప్పికొట్టాలి
- ప్రతి బూత్ స్థాయి ఏజెంట్ గణన ఫారాన్ని తప్పనిసరిగా నింపాలి
- ఓటు చోరీపై ఏడాది క్రితమే దేశానికి అవగాహన కల్పించిన రాహుల్ గాంధీ
- ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర కీలకం
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 23**
ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతి ఓటు బలమని, ఓటు హక్కులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. సోమవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక 'సమగ్ర ఓటరు జాబితా సవరణ" శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజుతో కలిసి ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, ఏడాది క్రితమే రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఓటు చోరీ ప్రయత్నాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ఎన్నికల వ్యవస్థలో చోటుచేసుకుంటున్న లోపాలను వెలుగులోకి తీసుకొచ్చారని తెలిపారు.
ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో ముఖ్య మంత్రులుగా పనిచేసిన నాయకులు సైతం తమ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా గెలవలేని పరిస్థితులు ఏర్పడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ పేరుతో ఓటరు జాబితాల్లో మార్పులు చేసి ప్రజల ఓటు హక్కులను హరించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆమె, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ స్థాయి ఏజెంట్ తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి గణన ఫారాన్ని సక్రమంగా నింపాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి అక్రమాలు, తొలగింపులు లేదా అనుమానాస్పద మార్పులు జరిగినా వెంటనే స్పందించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.

# జగిత్యాల జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్--2026 ప్రారంబించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 23:**
పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం అత్యంత అవసరమని, నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా 3వ పోలీస్ డ్యూటీ మీట్--2026 కార్యక్రమాన్ని ఎస్పీ అదనపు ఎస్పితో కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు, ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించేందుకు డ్యూటీ మీట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు. పోలీసు శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది చట్టాలపై సంపూర్ణ అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నేరస్థులను శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పోలీస్ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు అధికారులు,సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, అనుభవాలను పంచుకోవడానికి, వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకునేందుకు చక్కటి వేదిక అని అన్నారు.
ఈ డ్యూటీ మీట్‌లో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్, యాంటీ-సబోటేజ్ చెకింగ్, మరియు కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని అదేవిధంగా జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలకు విశేష గుర్తింపు లభిస్తుందని, రాష్ట్రాలు మరియు ఇతర ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య సమన్వయం, సహకారం, వృత్తిపరమైన అనుభవాల మార్పిడి పెరుగుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్,సుధాకర్,కరుణాకర్,రవి,కి రణ్ కుమార్,వేణు, మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఫోటో జ్ఞాపికను అందజేసిన బస్కే రాజేందర్

- వర్ధన్నపేటలో బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం
- సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ప్రక్రియపై సుదీర్ఘ చర్చ



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 22**
వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం మడికొండలోని సత్య సాయి కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సోమవారం నిర్వహించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యకర్తల జనరల్ బాడీ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు, భారత రాష్ట్ర సమితి హనుమకొండ జిల్లా సీనియర్ నాయకుడు బస్కే రాజేందర్ కేటీఆర్‌కు తన ఫోటో తో కూడిన మెమెంటోను అందజేశారు. జ్ఞాపికను స్వీకరించిన కేటీఆర్, ఉద్యమంలో సేవలందించిన బస్కే రాజేందర్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతంపై నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ శ్రేణులతో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటికి చేరువ కావాలని సూచించారు. అదే విధంగా, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణపై నేతలకు, కార్యకర్తలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాబోయే రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి నాయకుడిని గుర్తించాలని కోరుతూ.. బస్కే రాజేందర్ వినతిపత్రం అందజేశారు. పార్టీని నమ్ముకున్న ప్రతి నాయకునికి, గుర్తిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం అధ్యక్షుడు దామరప్పుల కోటేశ్వర్, పంగ సతీష్, బుర్ర యాదగిరి గౌడ్, వల్లెపు వంశీ రెడ్డి, బుర్ర సరిత, కొరివి సాయిప్రసాద్, బస్కే విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.